# కబేళా

"ప్రపంచంలో నాలాంటి ఆస్తిపరులు అతి తక్కువ మంది ఉంటారు"

ఈ మాటల్ని గత ముప్ఫై నలభై ఏళ్ళలో ఎన్ని వందల సార్లు చెప్పి వుంటానో లెక్కలేదు.

నిజంగానే నా ఇంట తరగని గని వుంది. విజ్ఞాన దాహార్తిని తీర్చే నీటి చెలమ వుంది.

గురజాడ, కందుకూరి, శ్రీశ్రీ, బాపిరాజు, విశ్వనాథ, టాగూర్, శరత్‌బాబు, గోపీచంద్, దేవులపల్లి, బుచ్చిబాబు, మొక్కపాటి, ముళ్ళపూడి, చలం, రంగనాయకమ్మ, కొ.కు, రావిశాస్త్రి, దాశరథి, ఆత్రేయ, నంది, నారాయణ రెడ్డి, సీతాదేవి, మహాశ్వేతాదేవి, చాసో, కారా, రంగాచార్య, నరసరాజు..... అంతేనా? ఊహూ. ఇంకెందరో ఎందరో తెలుగు మరియు ఇతర భారతీయ భాషా రచయితలు మా ఇంట కొలువై ఉన్నారు.

ఇక రామాయణ భారత భాగవతాలు భగవద్గీతలు వ్యాఖ్యాన సహిత వేదాలు పురాణ గ్రంథాలు ఎన్నో ఎన్నెన్నో వున్నాయి. దగ్గర దగ్గర తొమ్మిది వందల పైచిలుకు ఉంటాయి.

మా హైస్కూల్ గోడ మీద 'చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఓ మంచి పుస్తకం కొనుక్కో' అని రాసి వుండేది. రోజూ దాన్ని చూసేవాడ్ని. అది నా మీద గాఢముద్ర వేసింది.

ఆకర్షించిన ప్రతి పుస్తకం కొనటం చదవటం ఆపైన అట్టవేసి భద్రపరచటం అలవాటుగా మారింది. చిక్కులూ చికాకులూ వచ్చినా భరించరాని బాధ కలిగినా సంతోషం చిందేసినా పుస్తకం చేతుల్లోకి తీసుకుని 'మరో ప్రపంచం'లో కెళ్ళిపోయేవాడ్ని.

పుస్తకమంటే రెండు అట్టలూ వాటి మధ్య కొన్ని కాగితాలూ వాటి మీద వేల అక్షరాలూ కాదు. మౌన గురువు. ఆప్తమిత్రుడు. దిక్సూచి!

వయస్సుతో సంబంధం లేకుండా పుస్తకాలు ప్రతి దశలోనూ నన్ను ఊరడించాయి. లాలించాయి. సేదదీర్చాయి. వెన్ను తట్టాయి. పునరాలోచింపజేశాయి. ఆహ్లాద పరిచాయి. ఆనంద లోకాల విహరింప జేశాయి. అపూర్వ జ్ఞానాన్ని దోసిళ్లతో తాగించాయి.

నేను మూడేళ్ళకోసారి బదిలీల మీద ఊళ్ళు తిరగాల్సొచ్చేది. అప్పుడు మా సామాన్లలో నాలుగింట మూడొంతులు అట్ట పెట్టెలే వుండేవి. 'ఇవేమిటి బాబయ్యా' అని అడిగే వాళ్ళు కూలీలు. వాటినిండా పుస్తకాలున్నాయని చెబితే ఎంతగా ఆశ్చర్యబోయే వారో చెప్పలేను!

ఏ మాట కామాటే చెప్పుకోవాలి. నా భార్య ఎన్నడూ ఇల్లంతా పరుచుకునున్న పుస్తకాల్ని తక్కువ చేసి మాట్లాడలేదు. ఇల్లు చిమ్మేటప్పుడు పుస్తకాల కట్టల్ని చూసి ఒక్కనాడూ విసుక్కోలేదు. ప్రతీనెలా అంతో ఇంతో వాటికోసం ఖర్చు పెడుతున్నందుకు పల్లెత్తుమాట అన్లేదు. ప్రేమించడమంటే ప్రేమించిన వారి అభిరుచుల్నీ ప్రేమించడమే కదా!

నేను పని చేసిన ప్రతిచోటా ఇంటి చుట్టు పక్కలి వారికి పుస్తకపఠనం అలవాటు చేసే వాడ్ని. వయస్సుని బట్టి చక్కని పుస్తకాలు ఎన్నిక చేసిచ్చే వాడ్ని. ఎందరో యువకవులూ రచయితలూ అరుదైన గ్రంథాల కోసం మా ఇల్లు వెదుక్కుంటూ వచ్చేవారంటే అతిశయోక్తి కాదు. వాటిని జాగ్రత్తగా వెనక్కి తీసుకునే బాధ్యత నా శ్రీమతి స్వీకరించేది. వాటిని కన్న బిడ్డల్లా కాపు కాచేది.

అంత అపురూపంగా చూసుకున్న అపూర్వ సంపద భవిష్యత్తు ఇప్పుడు ప్రమాదంలో పడింది!

తొమ్మిదేళ్ళ క్రితం పదవీ విరమణ చేయగానే మా స్వస్థలం నర్సాపురంలో గోదావరి ఒడ్డున ఇల్లు కట్టుకుని స్థిరపడిపోయాను. ఇహ బదిలీల బెడద లేదు కదా పుస్తకాలింక భద్రంగా వుంటాయనెంతో సంతోషించాను.

అంతేకాదు. గ్రంథాల కోసం ప్రత్యేకంగా గదిని ఏర్పాటు చేశాను. అద్దాల బీరువాలూ పాఠకులు కూర్చుని చదువుకోడానికి వీలుగా రెండు బెంచీలూ చేయించాను.

'మీ ఇల్లే ఓ గ్రంథాలయం' అనేవారు మిత్రులు.

"మీరు రచయితలు కాబోలు!" అనేవారు కొందరు.

"కాదండీ. కేవలం పుస్తక ప్రియుడ్ని మాత్రమే" అని కించిత్తు గర్వంగానే జవాబిచ్చేవాడ్ని.

కొందరు మెచ్చుకునేవారు. మరికొందరు అపనమ్మకంగా చూసేవారు. 'రచయిత కాబోయినవాడు కాబోలు!' అని నవ్వుకున్న వాళ్ళూ వున్నారు.

'ఏ మాత్రం సంపాదించావేంటి' అని బంధువులడిగితే మహామహుల సాహిత్య నిధిని చూపించేవాడ్ని.

చిత్రమేమిటంటే మా పిల్లలూ పుస్తకాల మధ్య పెరిగిన వాళ్ళే. వాళ్ళా జ్ఞానసముద్రాన్ని జొపోశన పడితే బావుణ్ణని ఆశపడ్డాను. సంస్కరింపబడతారని ఎంతగానో ఆశించాను. ప్చ్. 'తర్వాత తీరిగ్గా చదువుతాంలే. ఇంట్లో ఉండేవే కదా ఎక్కడికి పోతాయి!' అనేవారు. చెప్పి చెప్పి 'వాళ్ళే తెలుసుకుంటారని' వదిలేశా.

ఇప్పుడు వాళ్ళతోనే చిక్కు – కాదు ముప్పొచ్చి పడింది!

ఈ మధ్యే మా ఆవిడ కాలం చేసింది. అమెరికాలో వుంటున్న పెద్దబ్బాయీ కోడలూ, విజయవాడలో ఉంటోన్న చిన్నబ్బాయీ కోడలూ, హైదరాబాదులో ఉంటున్న కూతురూ అల్లుడూ మనవళ్ళూ అంతా వచ్చారు.

కర్మకాండలయ్యాక ఆస్తిపాస్తులు పంచేసుకుంటామన్నారు. 'ఇప్పుడేం తొందర్రా' అంటే విన్లేదు. మారు మూలప్రాంతాల్లో ఉన్న ఆస్తుల విలువ పెద్దగా పెరగవు. పట్నాల్లో అయితే మహావేగంగా పెరుగుతాయంటూ ఏదేదో చెప్పుకొచ్చారు..

"అయితే నా పుస్తకాల ఆస్తినీ పంచుకోండి. వాటిని చక్కగా చూస్తే చాలు నేనెక్కడో అక్కడ పింఛను డబ్బుల్తో నిశ్చింతగా గడిపేస్తాను" అన్నాను.

పెదవి విరిచేశారంతా.

"పుస్తకాలని కన్నబిడ్డల్లా చూసుకో. అంతేతప్ప మాతో సమానంగా వాటికీ ఆస్తి పంచిస్తానని మాత్రం అనకు" అన్నాడు నవ్వుతూ చిన్నోడు.

ఆ నవ్వు తేలుకొండెలా అన్పించింది.

"అదే పెద్ద ఆస్తిరా. అమూల్య సంపద. ఏంటనుకున్నారో"

"మీకో నమస్కారం వాటికి రెండు నమస్కారాలు"

"వాటిని పంచుకోరా?" జీర గొంతుతో ప్రశ్నించాను.

"మనిషికి 48 కిలోలకు మించి అమెరికా పట్టు కెళ్ళలేం" అన్నాడు పెద్దవాడు.

"మా పిల్లలకు తెలుగు చదవటమే రాదు" అంది కోడలు అదో గొప్పగా భావిస్తూ.

"నాకు మా అమ్మ అన్నా తెలుగు అన్నా ఎంతో ఇష్టం. మరెంతో ప్రేమ. అందుకని తెలుగువీ తెలుగు అనువాదాలు మాత్రమే కొన్నాను. నువ్వు నవలలు చదువుతావు కదా, అవైనా తీసుకెళ్ళు తల్లీ" అన్నాను.

"ఈ-బుక్సే చదువుతున్నాను. ప్రింటు బుక్స్ వంక  కన్నెత్తి చూడటం ఎప్పుడో మానేశాను" అందామె.

కూతురేమో "అవి పెట్టుకోడానికి మా ఫ్లాట్‌లో జాగాలేదు. నువ్వు డబ్బు సర్దితే త్రీ బెడ్ రూం పోర్షన్ కొనుక్కుని వీటిని తీసుకెళ్తాం" అంది.

"కొడుకులకేమో ఇల్లూ స్థలాలూ మాకేమో పనికిరాని పుస్తకాలా!" అన్నాడు అల్లుడు నిరసనగా చూస్తూ.

చిన్న కొడుకు "ఈ రోజుల్లో ఇవి చదివే ఓపికా తీరికా ఎవరికున్నాయి నాన్నా. పిల్లల చేత హోం వర్కు చేయించేసరికే తల ప్రాణం తోక కొస్తోంది!" అన్నాడు.

"మరి ఈ అపురూప గ్రంథాలని ఏం చేద్దామంటారు?"

నా స్వర తీవ్రతకి ఉలిక్కిపడ్డారు. ఆ పైన నవ్వేరు.

"ఇదేదో పద్మనాభస్వామి అపూర్వ నిధి అయినట్టు మాట్లాడతావేంటి నాన్నా. పాత పేపర్లు కొనేవాళ్లకి అమ్మేద్దాం పదోపరకో వస్తాయి" అన్నాడు చిన్నోడు.

"ఒరే ఒరే ఏం మాటల్రా అవీ. మహారచయితల పుస్తకాలని చిత్తు కాగితాల్లా అమ్ముతావా? నా కంఠంలో ప్రాణం ఉండగా కుదరదు"

"మరేం చెయ్యమంటారో మీరే చెప్పరాదూ" విసుక్కున్నాడు పెద్ద కొడుకు.

"గ్రంథాల ఆస్తి సంగతి తేలే వరకూ ఆస్తి పంపకాల్లేవు" అంటూ తెగేసి చెప్పేను.

"మా మెడకి మిమ్మల్నే ఓ పెద్ద డోలులా తగిలిస్తున్నారు. మీతో బాటు ఈ పుస్తకాల్నీ

ఎక్కడ మోయగలం!" చేతులు తిప్పింది చిన్న కోడలు.

వాళ్ళంటే అసహ్యం కలిగింది.

పుస్తకాల గదిలో కెళ్ళి కూర్చున్నాను.

తపస్సు చేసుకుంటున్న ఋషుల్లా వున్నాయి. వాటివంక వేదనగా చూస్తూండిపోయాను.

అవతల హాల్లో పిల్లలు నా మాటల గురించీ ఆస్తి పంపకాల గురించీ నన్ను ఒప్పించడం గురించీ తర్జన భర్జన గర్జనలు పడుతున్నారు.

ఇక వీళ్ళతో లాభం లేదన్చెప్పి తిన్నగా శాఖా గ్రంథాలయానికెళ్ళాను.

నా పుస్తకభాండాగారాన్ని దానమిస్తానని లైబ్రేరియన్తో చెప్పేను.

"అలా తీసుకోడానికి నిబంధనలు ఒప్పుకోవు. ఎలాగో తీసుకున్నా వాటిని పెట్టుకోడానికి స్థలమూ లేదు రాక్సూ లేవు!" అన్నాడతడు.

నిస్సహాయంగా చూసి వెనుదిరిగాను.

"పాత పుస్తకాల గురించి గొడవెందుకు నాన్నా. ఎవరొకరికి ఇచ్చెయ్యొచ్చులే" అన్నాడు పెద్దబ్బాయి.

"ఎంతో ముచ్చట పడి కట్టుకున్న ఇంటిని అమ్మేస్తున్నారు. నేను అడ్డు చెప్ప లేదు. నా తనువెళ్ళక ముందే ఆస్తులు పంచేసుకుంటున్నారు. కాదనలేదు. కాని పుస్తకాలకో చక్కని ఆధారం దొరికే వరకూ నేనెక్కడుంటే అక్కడ నాతో బాటు నా పుస్తకాలూ ఉండాల్సిందే. దీనికి ఒప్పుకుంటేనే పంపకాలు " అని పట్టుబట్టాను.

మొదటికే మోసం వస్తుందనుకున్నాడు కాబోలు, "సరే నాన్నా. కారు కొనేదాకా మా కారు షెడ్డు ఖాళీయే కదా. అందులో పెట్టుకుందువుగాన్లే" అన్నాడు చిన్నకొడుకు.

గుండెల మీంచి పెద్ద బరువు దిగిపోయింది. కారు షెడ్డే నా గ్రంథాలయం, నా నివాసం అయిపోయింది.

అది లోతట్టు ప్రాంతం. ఇంకా అభివృద్ధి కాలేదు. ఎక్కడి కెళ్ళాలన్నా చాలా దూరం నడవాలి. అక్కడో ఇల్లు ఇక్కడో ఇల్లు చొప్పున ఉన్నాయి. ఎవరూ స్నేహితులు కాలేదు. నాతో నా గ్రంథ మిత్రబృందం ఉంది గనుక ఒంటరితనం నా దరి చేరలేదు.

షెడ్డు ముందు కాసిన్ని కుర్చీలు వేశాను. చుట్టు పక్కల వారందరికీ నా పుస్తకాలు చదువుకోవచ్చని చెప్పాను. సాయంకాలాలు ఒకరిద్దరు వృద్ధులూ నలుగురైదుగురు పిల్లలూ వచ్చి కూర్చుని చదువుకోవటం మొదలెట్టారు. నాకెంతో ఆనందంగా వుంది గాని కోడలికెంచేతో నచ్చలేదు. కొడుక్కేదేదో చెబుతోంది. వాడు ముఖం చిట్లిస్తున్నాడీ మధ్య!

"ఒరే అబ్బాయ్. నా స్నేహితుడొకడు ఈ బెజవాళ్ళోనే ఉంటున్నాడ్రా. మనింటికొస్తానంటున్నాడు. ఎడ్రస్సు ఏమని చెబితే తేలిగ్గా తెలుస్తుంది"

"కబేళా రోడ్డు అని చెవితే సరి"

తుళ్ళిపడ్డాను. "కబేళా?"

"అంతలా ఆశ్చర్యపోతున్నావేంటి నాన్నా. ఆ పైన వుందిలే..."

"అంటే పశువుల్ని చంపే కసాయి శాల.....!"

"ఆ. అదే.... పనికిరాని పాలివ్వని జంతువుల్ని కబేళాకి తోలక ఏం చేస్తారు చెప్పు. వాటిని పోషించాలంటే తాతలు దిగి రావాలి!"

మనస్సు చేదై మాటరాక కూలబడ్డా.

కాటికి కాళ్ళు చాచుకున్న వాడ్నే. డబ్బై ఏళ్ళ వాడ్నే. అయితే మాత్రం కబేళాకి వెళ్ళే దార్లో కాపురముండటం.....!

అవాళ నిద్రపట్టలేదు. ఏవేవో పిచ్చి ఆలోచనలు మెదడుని కొరుక్కు తినసాగాయి. నావంటూ ఈ గ్రంథాలు తప్ప వీళ్ళు విలువిచ్చే ఆస్తిపాస్తులేం నా దగ్గర లేవిప్పుడు. ఖర్మకాలి పింఛను ఆగిపోతే నన్నూ కబేళాకి....!

లేచి కూర్చుని భగవద్గీతని చేతుల్లోకి తీసుకున్నాను. అరగంట తర్వాత ప్రశాంత చిత్తంతో నిద్రపోయాను.

మిత్రుడొచ్చాడు. ఇద్దరం మూడు నాలుగేళ్ళ పాటు రాజమండ్రిలో కలిసి పనిచేశాం. అప్పటి ఆఫీసు విషయాలూ ఇప్పుడు మారిన రాజమండ్రి కబుర్లూ కలబోసుకున్నాం.

"పుస్తకసేకరణ మీ హాబీ కదా. ఇప్పటికీ కొనసాగిస్తున్నారా"

"పుట్టుకతో వచ్చిన బుద్ధి కదా...!" అని నవ్వుతూ కారుషెడ్‌లోని నా దేవాలయాన్ని చూపించాను.

అతడి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "ఎంత శ్రద్ధగా చూసుకుంటున్నారూ!" అన్నాడు.

ఏ పుస్తకాన్ని ఎప్పుడు ఎక్కడ కొన్నదీ ఎలా కొన్నదీ ఎన్నిసార్లు చదివిందీ ఎందరేమని మెచ్చుకున్నదీ ఏకరువు పెట్టాను. పురుగూ పుట్రా పట్టకుండా ఎలాంటి శ్రద్ధ తీసుకుంటున్నదీ వివరించా.

"నన్నడిగితే ప్రతి ఇంటా ఓ గ్రంథాలయం ఉండాలి. అందుకు నాందిగా పెళ్లిళ్ళలో పుస్తకాలే బహూకరించాలి. జీవితాన్ని నడిపించేవీ నిలబెట్టేవీ ధన్యం చేసేవీ పుస్తకాలే" అన్నాను ఉద్విగ్నుణ్ణై.

"ఇది చాలా ఖరీదైన అలవాటు. ఇవాళ రేపు పుస్తకాలు చాలా ఖరీదైపోయాయి. మెల్లగా తెలుగు పుస్తకాలు మన జీవితాల్లోంచే మాయమైపోతాయి"

నా గుండెల్ని ఉక్కుహస్తాలతో పిండినట్టన్పించింది. గిలగిల్లాడాను.

"అలాగంటావేంటి. క్షరం లేనిది కదా అక్షరం. సరస్వతీ నమస్తుభ్యం అని చదువు మొదలెట్టిన మనం అలా మాట్లాడటం బావోలేదు"

"నేటి జనానికి ఇంగ్లీషు తప్ప తెలుగక్కర్లేదు. పోటీ పరీక్షలవి తప్ప ఇంకో పుస్తకం అక్కర్లేదు. అయినా ఎవరైనా ఎన్నని కొనగలర్లే - డబ్బు మూటలు ఉండొద్దూ!"

"అవి చూపే ప్రభావాన్ని బట్టి లెక్కకడితే చాలా చౌక అని చెప్పాలి. గ్రంథ పఠనం మనిషిని చైతన్యపరుస్తుంది. మెదడుకి పదునుపెడుతుంది. అలసట తీరుస్తుంది. ఊహా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. పుస్తకాలు చదివే వారికి ఆలోచనా శక్తి అధికంగా వుంటుంది. అయినవారి మీద ఆత్మీయతాభిమానాలు ఎక్కువగా ఉంటాయి. ఊహాశక్తి పెరుగుతుంది. కొత్తకొత్తవి కనుక్కోవాలి, పరిశోధించాలి అన్న జిజ్ఞాస కలుగుతుంది. ఇహ పుస్తకాలు చదివే వారెవరూ తొందరగా చెడుదార్లు తొక్కరు. ఇది మంచా చెడా, నీతి పనా అవినీతి పనా అని ఒకటికి రెండు సార్లు ఆలోచిస్తారు..."

నా మాటలు చాదస్తంగా తోచాయి కాబోలు ఇహ వెళ్తానంటూ లేచాడు.

"ఎప్పుడూ ఆ పుస్తకాల రంధే! బజారు కెళ్ళి నాలుగు కాయగూరలు తెద్దామన్న

ఆలోచనే లేదు మనిషికి!" ఇల్లు చిమ్ముతూ బిగ్గరగా అంది కోడలు.

నా మొహం ఎఱ్ఱబడింది "వీడ్ని సాగనంపి వచ్చి వెళ్తాన్లే"

"ఈయనకే కాదు ఈయన పుస్తకాలకీ చాకిరీ చెయ్యలేక ఛస్తున్నాను. ఊళ్ళో బోల్డు వృద్ధాశ్రమాలున్నాయి. అక్కడ చావొచ్చుగా!"

అవి నాకు మామూలే అయినా మిత్రుడి ముందు జీర్ణించుకోలేకపోయాను.

మిత్రుడి వెనుకే గబగబా అడుగులేశాను.

సందు మలుపు తిరిగేక మరేమన్పించిందో గాని "మేం బదరీనాథ్ కేదారనాథ్ యాత్ర కెళ్తున్నాం. నువ్వూ రాకూడదూ ఆట విడుపుగా ఉంటుంది" అన్నాడు.

మనస్సులో ఆనందతరంగం ఎగిసిపడింది.

"ఎప్పట్నుంచో హిమాలయాల్ని దగ్గర్నుంచి చూడాలనెంతో కోరిగ్గా వుంది. మీతో వస్తాను. పింఛను డబ్బు ఉందిలే..."

పుస్తకాలని భద్రంగా చూడమనీ రోజూ షెడ్డు చిమ్మమనీ ఇంకెన్నో జాగ్రత్తలు చెప్పి వాటి బాధ్యత చిన్న కొడుక్కీ కోడలికీ అప్పగించి ఉత్తర దేశయాత్రకి బయల్దేరాను.

మా బృందంలోనే వున్న చురుకైన యువకుడు వేణు మా విజయవాడ వాడేనని తెలిసి పొంగిపోయా.

ప్రతి దానికీ ముందుంటూ మా ముసలోళ్ళకే ఇబ్బందీ లేకుండా, రాకుండా శ్రద్ధ తీసుకుంటున్నాడు.

అతడి గురించడిగాను.

ఏదో బ్యాంకులో పనిచేస్తున్నాట్ట. విజయవాడ నానుకుని కంకిపాడు రోడ్డులో కొత్తగా ఏర్పడిన ఓ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కి సెక్రటరీ అంట. అందర్నీ కలుపుకుని ప్రతి ఇంటి ముందూ మొక్కలు నాటిస్తున్నాననీ చెత్తకుండీలు పెట్టి చెత్తని ఒక్కచోటే వేయిస్తున్నాననీ చెప్పుకొచ్చాడు.

"ఒక లైబ్రరీని ఏర్పాటు చెయ్యాలనుకున్నానుగాని సరైన స్పందన రాలేదండీ" అన్నాడు బాధగా నిట్టూరిస్తూ.

ఆ మాటలు నా చెవులకు అమృతపు సోనల్లా సోకాయి. ఎగిరి గంతేశాను.

"నా పుస్తకాలిస్తాను. తొమ్మిదొందల దాకా ఉన్నాయి. కథలూ కవిత్వమూ నవలలూ పురాణ గాథలూ వేదాలూ అన్ని రకాల గ్రంథాలూ ఉన్నాయి. గత నలభై ఏళ్ళ నుంచీ సేకరించినవి. అన్నీ మంచి స్థితిలో ఉన్నాయి. వాటిని సంరక్షిస్తూ నలుగురికీ విజ్ఞానాన్ని పంచితే చాలు. జ్ఞానస్రవంతిని ప్రవహించనిస్తే శాన. అవసరమైతే బీరువాలకి కొంత ధనసాయమూ చేస్తాను..."

నా తపన నా ఆర్తి అర్థమైంది కాబోలు నన్నెంతో అభినందించి "మీ ఉత్సాహం నాకు కొత్త బలాన్నిస్తోంది. మా ఇంటి ముందు గదిని లైబ్రరీకి కేటాయించేస్తా. మనం తిరిగెళ్ళగానే గ్రంథాలయానికి శ్రీకారం చుడదాం..." అన్నాడు.

పరమానంద పడిపోయాను. నా కళ్ళనుంచి ఆనంద భాష్పాలు ధారలు కట్టాయి.

హిమాలయ సౌందర్యం కన్నా అతడి సేవా దృక్పథం నన్ను అమితంగా ఆకర్షించింది! 'నువ్వేనయ్యా నాకు నిజమైన వారసుడివి' అని గుండెలకు హత్తుకున్నాను.

రైల్లో తిరిగి వస్తోంటే విజయవాడని వరద నీరు ముంచెత్తిందని ఎవరో చెప్పేరు .

వేణు దగ్గరి సెల్‌ఫోన్ తీసుకుని ఆదుర్దా పడుతూ ఇంటికి ఫోన్ చేశాను. చిన్న కోడలు ఎత్తింది. "అంతా బావున్నారా? పుస్తకాలు బాగున్నాయా?"

"మనవలెలా వున్నారోనన్న ఆత్రం లేదు కాని పుస్తకాల కోసం కలవరిస్తున్నారా? హవ్వ! ఎవరైనా వింటే నోట్లో వూస్తారు! పొద్దుగూతా పుస్తకాలు పుస్తకాలన్న గోలే. మీరు పోయినప్పుడు వాటినీ మీతోనే తగలేస్తాం లెండి" నిరసనగా చెప్పి లైన్ కట్ చేసింది.

హతాశుడ్నయ్యాను. నా ఉద్దేశం అది కాదని చెప్పాలని మళ్ళీ మళ్ళీ ప్రయత్నించాను గాని కోడలు ఫోనెత్తలేదు.

"మీ ప్రాంతం బాగా మునిగిపోయిందిట....." తన బంధువుల్నడిగి కనుక్కుని చెప్పేడు వేణు.

మనస్సుండబట్టలేక అబ్బాయికి ఫోన్ చేశాను. "అంతా బాగానే వున్నాం నాన్నా. ఇంటికి తాళం వేసి విలువైనవి తీసుకుని పటమటలోని మాతోడల్లుడింటికి వెళ్తున్నాం"

"నా పుస్తకాలు?" "నిక్షేపంలా వుంటాయిలే" వ్యంగ్యంగా అన్నాడు.

మరి తర్కించలేకపోయాను. గుండెల్లో అశుభ స్వరాలు మార్మోగుతున్నాయి.

రైలు దిగటం ఆలస్యం ఆటో మీద తిన్నగా ఇంటి కెళ్ళాను.

కారు గ్యారేజ్ సగం ఎత్తు వరకూ నీళ్ళు!

గుండెలు బాదుకుంటూ నీటికడ్డం పడ్డాను. ఎవరెవరో వచ్చి రెక్కలు పట్టుకుని వెనక్కిలాక్కొచ్చారు.

సర్వం కోల్పోయినట్టుగా ఉంది. ఒంట్లోంచి జీవపదార్థాన్ని తోడేసినట్టుగా ఉంది. గుండె చెరువయ్యింది! దుఃఖం వెల్లువెత్తింది!

ఇంకో రెండ్రోజులగ్గాని నీరు తీయలేదు. ఆ వెంటనే బురదకడ్డంపడి వెళ్ళి గ్యారేజ్ డోర్ తెరిచాను.

బురదమట్టిలో సమాధి అయిపోయాయి నా అపురూప గ్రంథాలు. పిచ్చిగా తవ్వి తీశాను. ఎన్నో ఏళ్ళుగా కంటికి రెప్పలా కాపాడుకున్న విజ్ఞాన ఖని.....!

కన్నీటిసంద్రం చెలియలి కట్టదాటింది. వాటి ప్రక్కన జీవశ్చవంలా కూలబడ్డాను.

మున్సిపాలిటీ ట్రాక్టర్లొచ్చాయి. వరదకి కొట్టుకొచ్చిన చెత్తనీ కుళ్ళి పాడైపోయిన వస్తువుల్నీ వాటిల్లోకి ఎక్కిస్తున్నారు. మా అబ్బాయి మట్టిపాలైన నా పుస్తకాల్నీ ఎక్కించాడు.

పిచ్చిగా అరుస్తూ ఏడుస్తోంటే "మా అత్తగారు పోయినప్పుడు కూడా ఈయన ఇంతగా రోదించలేదు. పండుటాకు రాలక తప్పదని వేదాంతం వల్లించారు. ఇప్పుడేమో పీడ విరగడయ్యిందని సంతోషించక పాత పుస్తకాల కోసం గుండెలు బాదుకుంటున్నారు. ఎంత పిచ్చి మనిషో చూడండి!" ఎవర్తోనో అంటోంది కోడలు.

"నోర్మూయ్" . దుఃఖోద్ధృతితో ఊగిపోతూ గర్జించాను. ట్రాక్టర్ కదిలింది.

దానిలో కబేళాకి తీసుకెళ్తోన్న మూగజీవాల్లా నా పుస్తకాలు.....!

గుండెలు వేనవేల ప్రక్కలవుతోంటే గుండె పట్టుకుని కుప్పకూలి పోయాను!

**(తెలుగు వెలుగు ఏప్రిల్ 2013)**